లింకురోడ్డుకు వెళ్లే దారి కబ్జా

హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు

శేరిలింగంపల్లి: జీహెచ్‌ఎంసీ లింకు రోడ్డుకు వెళ్ళే దారిని ఆక్రమించి ప్రహరీ నిర్మించారని.. దీంతో వేలాది కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు పాపిరెడ్డినగర్ అధ్యక్షులు బద్దం కొండల్‌రెడ్డి మంగళవారం ఫిర్యాదు చేశారు. పాపిరెడ్డినగర్ నుంచి జీహెచ్‌ఎంసీ ఆఫీస్ వరకు ఉన్న లింకు రోడ్డుకు వెళ్లే రోడ్డును కబ్జా చేసి ప్రహరీ నిర్మించారని, దీంతో పాపిరెడ్డినగర్, సందయ్యనగర్, సురభికాలనీ, రాజీవ్ గృహకల్ప, రాజీవ్ స్వగృహలలో నివసించే సుమారు 45 వేల మంది ప్రజలు ఇబ్బందిపడుతున్నారని వివరించారు. పాపిరెడ్డినగర్‌లో పర్యటించి సమస్యను పరిష్కరించాలని హైడ్రా కమిషనర్‌ను కోరారు.

నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఎన్నిక



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నాయి బ్రాహ్మణ సేవా సంఘంను ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా సాయిలు, ఉపాధ్యక్షులుగా పరుశురాం, ప్రధాన కార్యదర్శిగా ముత్యాల రవీందర్, గోల్డెన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రవికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సత్యంలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారిని కమిటీ ప్రతినిధులు మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ నాయి బ్రాహ్మణుల సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఉదయ్, నరేష్, కిరణ్, అభి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం నిర్వహించిన డ్రైవ్‌లో 9 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఐదుగురికి ఒక్కొక్కరికి రూ.వెయ్యి, ముగ్గురికి రూ. 1500, మరో వ్యక్తికి రూ.2 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

గాయత్రీదేవిగా..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. పలు ఆలయాల్లో అమ్మవార్లకు పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. సామూహిక పారాయణం, కుంకుమార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివసాయి క్షేత్రంలో నవ చండీహోమం నిర్వహించారు. అఖండ దీపారాధన నిర్వహిస్తున్నారు.

– శేరిలింగంపల్లిజోన్ బృందం



గాయత్రీదేవిగా రాజరాజేశ్వరి



శివసాయిక్షేత్రంలో..



గాలిదొడ్డిలోని పోచమ్మ, ఎల్లమ్మ దేవాలయంలో..







చందానగర్‌లో..



నవ చండీయాగం పూర్ణాహుతి

15 రోజుల్లో కొత్త విద్యుత్ స్తంభాలు

రాయదుర్గం: ఖాజాగూడ వీకర్ సెక్షన్‌లో 15 రోజుల్లో కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయిస్తామని టీజీ ఎస్‌పీడీసీఎల్ సైబర్ సిటీ సూపరింటెండెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్ స్థానికులకు హామీ ఇచ్చారు. బస్తీబాటలో భాగంగా గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడ వీకర్ సెక్షన్‌బస్తీలో ఆయన విద్యుత్ అధికారులతో కలిసి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్తీలో విద్యుత్ వినియోగం, బిల్లుల చెల్లింపులు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బస్తీబాటలో సమస్యలు తెలుస్తున్నాయని, దశలవారిగా పరిష్కరిస్తామన్నారు. అధికారులు డీఈ యాదగిరి, ఏడీఈ శివ కృష్ణప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



ఖాజాగూడ వీకర్ సెక్షన్‌లో పర్యటిస్తున్న ఎస్ఈ చంద్రశేఖర్, అధికారులు

పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలి



రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని ఈఎస్ఐ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని జిల్లా సీఐటీయూ నాయకులు నాయిని నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం రామచంద్రాపురం పట్టణంలో ఈఎస్ఐ ఆసుపత్రి ముందు కాంట్రాక్ట్ కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు నెల నెల వేతనాలు ఇవ్వకుండా శ్రమదోపిడీ చేస్తున్నారని విమర్శించారు. సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడంతో రెండు పూటలా తినలేని పరిస్థితి నేలకొంది. దసరా పండుగను దృష్టిలో పెట్టుకొని రెండు రోజులలో వేతనాలు ఇవ్వాలని లేని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, యాదయ్య, లోకనాథ్, సంతోషి, పోచమ్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

శస్త్రచికిత్సలతో ఆత్మవిశ్వాసాన్ని అందించాం

మాదాపూర్: మెడికవర్ ఆస్పత్రిలో రెండు వేలకు పైగా పునర్నిర్మాణ, కాస్మోటిక్ శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేశామని డాక్టర్ రాజశేఖర్ మాదల బృందం మంగళవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పుట్టుకతో పెదవుల చీలిక, ప్రమాదాల్లో గాయపడ్డ, ముఖ ఆకృతిలో మార్పులు, రొమ్ము చికిత్సలు, గడ్డం, దవడ, ఆకృతి సవరణలు తదితర శస్త్ర చికిత్సలను చేసినట్టు తెలిపారు. అధునాతన శస్త్రచికిత్స, సాంకేతికతల ద్వారా ఆత్మవిశ్వాసం, జీవన నాణ్యతను తిరిగి అందించగలగామన్నారు. విజయానికి తోడ్పడిన నిపుణుల బృందంలో జనరల్ సర్జన్ డాక్టర్ వెంకట్ పవన్, డాక్టర్ కౌశిక్, ట్రామా సర్జన్ డాక్టర్ దామోదర్, అనస్థీషియా విభాగాదిపతి డాక్టర్ వేణుగోపాల్ తదితరులు సహకరించినట్టు తెలిపారు.

నివాళి

రాయదుర్గం: ఉద్యమకారుల త్యాగాలు మరువలేనివని బీఆర్‌ఎస్ శేరిలింగంపల్లి నాయకులు కొమిరిశెట్టి సాయిబాబా అన్నారు. మంగళవారం ఖాజాగూడలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో కొండకల్ శంకర్‌గౌడ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అంజమ్మ, రమేష్‌గౌడ్, శ్రీనివాస్, బాలమణి, తాహెర్, మాధవి, బురాన్ తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు



నవదుర్గ నమోస్తుతే..

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఒడిసి, కూచిపూడి నృత్య ప్రదర్శనలు సందర్శకులను అలరించాయి. దేబ్రసి పట్నాయక్ బృందం ఒడిస్సీ నృత్యంలో నవదుర్గ, స్థాయి, జన సమ్మోహిని తదితర అంశాలను నీలాంజన, అనన్య, స్వాతి, సోనాలి, యుక్తి, నందు ప్రదర్శించారు. దుర్గేష్ నందిని శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనలో భాగంగా గణేశ పంచరత్న, జయము జయము, శారదా భుజంగం, హంసనందిని, తిల్లాన, కామాక్షి స్తుతి, దశావతారం తదితర అంశాలను ప్రదర్శించారు.

సరస్ మేళా– 2025

మాదాపూర్‌లోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో ఏర్పాటు చేసిన సరస్ మేళాలో ఉత్పత్తులను కొనుగోలు చేశారు. గృహాలంకరణ, పిండి వంటలు, జ్యూట్‌బ్యాగ్స్, టెర్రకోట ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఈనెల 29వ తేదీ వరకు నిర్వహించనున్న మేళాలో వివిధ ప్రాంతాలకు చెందిన ఉత్పత్తులను స్టాల్స్‌లో అందుబాటులో ఉంచారు. ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని హెచ్‌సీయూ విద్యార్థి సంఘం అధ్యక్షుడు శివ పాలెపు స్పష్టం చేశారు. ఆదివారం మాట్లాడుతూ హాస్టళ్లలో నాణ్యమైన ఆహారం అందేలా చేయడమే ప్రధాన లక్ష్యం అని అన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఈ విజయం కేవలం కార్యకర్తలు, విద్యార్థుల సమిష్టి కృషికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

సినీనటి జయసుధకి ధైర్య అవార్డు

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నాదబ్రహ్మోత్సవ్ 2025 కార్యక్రమాన్ని మంగళవారం డాక్టర్ పద్మశ్రీ శోభరాజు ప్రారంభించారు. ఆత్మవిశ్వాసం, అంకితభావంతో సమాజంలో సేవలను అందించిన సినీనటి జయసుధకి ధైర్య అవార్డును కార్యక్రమంలో భాగంగా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అందజేశారు. అనంతరం ఆస్థాన నర్తకి ప్రముఖ కళాకారులు శృతకీర్తి తన 50 మంది బృందంతో కలిసి అన్నమయ్యకీర్తన, మహిషాసుర మర్దిని నృత్యప్రదర్శనతో సందర్శకులను అలరించారు.

జర్నలిజంలో సవాళ్లను ఎదుర్కోవాలి

'మనూ' వీసీ ప్రొ. ఐనుల్ హసన్

రాయదుర్గం: జర్నలిజం వృత్తిలో కొత్త సవాళ్లను ఎదుర్కోవడానికి ఉర్దూ జర్నలిస్టులు సిద్ధంగా ఉండాలని మనూ వీసీ ప్రొ.ఐనుల్ హసన్ అన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో కేంద్ర విద్యాశాఖ, ఉర్దూ భాష ప్రమోషన్ నేషనల్ కౌన్సిల్ (ఎన్‌సీపీయూఎల్), మనూలోని మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం విభాగం సంయుక్తంగా నిర్వహించిన 'ఉర్దూ జర్నలిస్టుల సామర్థ్య నిర్మాణం' అనే అంశంపై మూడురోజుల జాతీయ వర్క్‌షాప్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. జర్నలిస్టులు, విద్యార్థులు తమ భాషా నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలన్నారు. భారత న్యూస్ నెట్‌వర్క్ సీఈఓ, ఎడిటర్ ఇన్ చీఫ్ డాక్టర్ సర్ఫరాజ్ సైఫీ మాట్లడుతూ ఉర్దూ జర్నలిజంలో ముఖ్యంగా ప్రసార రంగంలో అవకాశాలు, అడ్డంకులను ఆయన వివరించారు. అనంతరం యూనివర్సిటీ మ్యాగజైన్ 'అల్–కలామ్'ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మ్యాగజైన్ ఎడిటర్ పీఆర్‌ఓ డాక్టర్ మహ్మద్ ముస్తఫా అలీ సర్వారీ, ఫ్యాకల్టీ, అధికారులు, ఉర్దూ జర్నలిస్టులు పాల్గొన్నారు.